క్లుప్తంగా

ఈవోఐలు రద్దు చేయాలని ఆందోళన



స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు వద్ద నినాదాలు చేస్తున్న కార్మికులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ప్రకటించిన 46 విభాగాల ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ) లను తక్షణమే రద్దు చేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈవోఐలకు వ్యతిరేకంగా శుక్రవారం సాయంత్రం స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు నుంచి గాజువాక వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరగదని చెబుతూ మరోపక్క ఉక్కు యాజమాన్యం ప్రకటించిన ఈవోఐలను సమర్థించడం విచిత్రంగా ఉందన్నారు. నగరంలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు స్టీల్‌ప్లాంట్‌లోవాస్తవ పరిస్థితులను విన్నవించడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. స్టీల్ యాజమాన్యం అనుసరిస్తున్న విధానాల వల్ల స్టీల్‌ప్లాంట్‌లో అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి పూర్తి స్థాయిలో ఉత్పత్తికి అవసరమైన ముడి పదార్థాలు సమకూర్చాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ ప్రతినిధులు జె. అయోధ్యరామ్, డి. ఆదినారాయణ, రమణమూర్తి, గణపతిరెడ్డి, డి.వి. రమణారెడ్డి, డేవిడ్, యు.రామస్వామి, కె.ఎస్.ఎన్. రావు, సుబ్బయ్య, ఎస్. రామారావు, నమ్మి రమణ తదితరులు పాల్గొన్నారు.

మాతృశ్రీనగర్‌లో ప్రత్యేక పూజలు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు మాతృశ్రీనగర్‌లో వరసిద్ధి వినాయక 13వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజతో పాటు విష్ణు సహస్రనామ పారాయణం, కుంకుమార్చన చేశారు. అనంతరం కాలనీ అభివృద్ధికి సహకరిస్తున్న 86వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు చేగొండి శ్రీనివాసరావును మాతృశ్రీనగర్ వాసులు, పెద్దలు సన్మానించారు. కార్యక్రమంలో కాలనీ నాయకులు దామాసుబ్బారావు, ఆర్.భీమప్రసాద్, రవీంద్రకుమార్, గంగాధర్, రమణ, విశ్వేశ్వరరావు, ఎం.ఎస్.ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆ రెండు స్టేషన్లలో హాల్ట్ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వర్

అగనంపూడి: దువ్వాడ, సింహాచలం రైల్వేస్టేషన్లను సబర్బన్‌గా పరిగణించి అన్ని రైళ్లకు హాల్ట్ ఇవ్వాలని జోనల్ రైల్వే కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్ ప్రతిపాదనలు చేశారు. భువనేశ్వర్‌లో శుక్రవారం తూర్పు కోస్తా రైల్వే జోనల్ కన్సల్టేటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దువ్వాడ రైల్వేస్టేషన్, విశాఖ మహానగర స్టేషన్ల అభివృద్ధికి ప్రతిపాదనలు చేశారు. విశాఖ నుంచి బెంగళూరు, తిరుపతి, చెన్నై వంటి నగరాలకు రోజు రాత్రి ప్రయాణం చేసే రైళ్లకు బోర్డుకు ప్రతిపాదనలు చేయాలని, శ్రీకాకుళం నుంచి రాజమండ్రి, కాకినాడకు లోకల్ రైళ్లను (షటిల్ ట్రెన్లను) నడపాలని, నాగపూర్-బిలాస్‌పూర్, విశాఖ దుర్గ్ వందే భారత్‌కు తగిన డిమాండ్ లేనందున విశాఖ నాగపూర్‌కు నేరుగా రైలు నడపాలని కోరారు. వందే భారత్ రైళ్ల కోసం దువ్వాడ, సింహాచలం వద్ద సబర్బన్ హాల్ట్ ఏర్పాటు చేసేలా బోర్డుకు ప్రతిపాదనలు పంపాలని, తిరుపతి- విశాఖ డబల్ డెక్కర్, ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌లకు సీటింగ్ కోచ్‌లు స్థానంలో 2ఏసీ, 3ఏసీ స్లీపర్ కోచ్‌లు ఏర్పాటు చేసి ర్యాకులను పెంచాలని ఆయన ప్రతిపాదనలు చేశారు. దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధి కె.విజయ్ కుమార్ పాల్గొన్నారు.

సింహగిరిపై శ్రీనృసింహ హోమం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం సింహగిరిపై శ్రీనృసింహ హోమం ఘనంగా జరిపారు. ఉదయం 7 నుంచి ఆలయ కల్యాణమండపంలో అర్చకులు హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదికపై చక్రపెరుమాళ్లను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, షోడశోపచారపూజలు చేశారు. పూజలో పాల్గొన్న భక్తులకు కంకణధారణ చేసి హోమగుండం వద్ద వేంజేపచేశారు. అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి వైభవంగా నిర్వహించారు.



అగనంపూడి ముఖచిత్రం

ఇదేం ప్రతిపాదన మహాశయా!

- అగనంపూడి కేంద్రంగా జోన్ ఏర్పాటు చేయాలి
- లేని పక్షంలో గాజువాక జోన్‌లో కొనసాగించాల్సిందే..
- పెందుర్తిలో విలీనం చేయాలని చూస్తే తిరుగుబాటు తప్పదు
- స్పష్టం చేస్తున్న అగనంపూడి పరిసరగ్రామాల వాసులు




ఎంపీ భరత్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు (ఫైల్)

అగనంపూడి: గాజువాక జోన్‌లోని నాలుగు వార్డులను పెందుర్తి-2 జోన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని జీవీఎంసీ కౌన్సిల్ తీర్మానం చేయడంపై స్థానికులు భగ్గుమంటున్నారు. పాలనా సౌలభ్యం పేరుతో ప్రస్తుతం గాజువాక జోన్‌లో ఉన్న వార్డులను పాలనకు దూరం చేయాలనే కుట్రలో భాగమే ఈ తీర్మానమని మండిపడుతున్నారు. 77, 78,79,85 వార్డులు గాజువాకకు సమీపంలో ఉన్నాయని, వీటిలో సగ భాగం గాజువాక నియోజకవర్గంలో ఉండగా, పెందుర్తి-2 జోన్‌గా ఏర్పాటు చేయాలని జీవీఎంసీ మేయర్, పాలకవర్గం కావాలని కుట్ర చేస్తుందని ఆయా వార్డుల ప్రజలు. నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెదగంట్యాడ, గాజువాక రూరల్, పరవాడ మండలానికి చెందిన గ్రామాలు గాజువాకకు చేరువలో ఉన్నాయని .. అలాంటి గ్రామాలను 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెందుర్తి-2 పేరుతో జోన్ ఏర్పాటు చేయాలని భావించడం అవివేకమే అవుతుందంటున్నారు. అలా చేస్తే తిరుగుబాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రజా సంఘాలు అల్టిమేటం జారీ చేశాయి. టీడీపీ నాయకులు సైతం ఆ ప్రతిపాదనను తప్పుబడుతున్నారు. 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న గాజువాకను కాకుండా జోన్ ఏర్పాటు చేయాల్సి వస్తే అగనంపూడి కేంద్రంగా జోన్ ఏర్పాటు చేయాలని పార్టీలకు అతీతంగా నాయకులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నాయకులకు వినతులు

అగనంపూడి కేంద్రంగా 77,78,79,85,86,87,88 వార్డులతో జోన్ ఏర్పాటు చేయాలని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విశాఖ ఎంపీ భరత్, మేయర్ పీలా శ్రీనివాసరావు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావులకు కర్రి దశేంద్ర, విందుల రాజు వినతిపత్రాలు అందజేశారు. గాజువాక జోన్‌ను రెండుగా విభజించి గాజువాక-2గా ఏర్పాటు చేసి అగనంపూడిలో జోనల్ కార్యాలయం ఏర్పాటు చేయాలని వారు కోరారు.

నిర్ణయం మార్చకుంటే ఉద్యమం



చేతిలో అధికారం ఉందని అడ్డదిడ్డంగా ఎవరికి నచ్చినట్టు వారు చేసుకుంటూ పోతే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదు. పెందుర్తి ప్రాంతానికి చెందిన మేయర్ తన ప్రాంతంలో రెండు జోన్లు ఉండాలని భావించి ఇలా చేస్తున్నారా? ప్రజలు, వారు ఎన్నుకున్న కార్పొరేటర్ల అభిప్రాయాలతో సంబంధం లేకుండా గాజువాక జోన్‌లోని వార్డులను పెందుర్తి కేంద్రంగా జోన్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించడం దుర్మార్గం. ఇలాంటి నిర్ణయాలు వెనక్కి తీసుకోవాలి.

– కొలిపాక అప్పారావు, పద్మశాలి సేవా సంఘం

ఏంటీ మతలబు ?



పెందుర్తిలో రెండు జోన్లు ఏర్పాటు చేయడం, వాటిలో గాజువాక, పెదగంట్యాడ, పరవాడ మండలాలకు చెందిన ప్రాంతాలను విలీనం చేయాలనుకోవడం అనాలోచిత నిర్ణయం. ఈ ప్రాంతాలకు పెందుర్తి 40 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. 12 కిలోమీటర్ల దూరంలోని గాజువాక జోన్‌లోని ప్రాంతాలను నాలుగింతల దూరంలోకి నెట్టాలని చూడడం దుర్మార్గమైన ఆలోచన. సుమారు 60వేల జనాభా ఉన్న అగనంపూడి ప్రాంతాన్ని పరిగణలోకి తీసుకొని అగనంపూడి కేంద్రంగా జోన్ ఏర్పాటు చేయాలి. లేని పక్షంలో పాత విధానంలోనే కొనసాగించాలి.

– బలిరెడ్డి నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి

పెండింగ్ జీతాలు

చెల్లించాలని వినతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అధికారులకు పెండింగ్ జీతాలతో పాటు ప్రతీ నెలా పూర్తి జీతం చెల్లించాలని ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం సీఎండీకి వినతిపత్రం అందజేశారు. అధికారులకు పదోన్నతులు, వేతన సవరణ, హెచ్ఆర్ఏ పునరుద్ధరణ తదితర సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. దసరాలోగా ఉద్యోగులకు పెండింగ్ జీతాలు చెల్లిస్తే ఉద్యోగుల్లో స్ఫూర్తి పెరుగుతుందని సీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాటం చంద్రరావు, కె.వి.డి. ప్రసాద్ వినతిపత్రంలో పేర్కొన్నారు.

విద్యార్థులకు అభినందన



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో మహిళా కళాశాల అధ్యాపకులు

అగనంపూడి: విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 9 మంది విద్యార్థులు భారీ ప్యాకేజీతో రాయల్ బ్యాంక్ ఆఫ్ స్కాట్లాండ్ (నాట్‌వెస్ట్)లో ఉద్యోగావకాశాలు దక్కించుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ అరుంధతి తెలిపారు. అలాగే అదే బ్యాంక్‌లో ఇంటర్న్‌షిప్ చేయడానికి మరో 8 మందికి అవకాశం దక్కిందని పేర్కొన్నారు. వీరికి నెలకు రూ.55వేల స్టైపండ్ చెల్లించనున్నారని కళాశాల చెప్పారు. ఈ మేరకు కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ప్లేస్‌మెంట్ డీన్ మహేంద్రసాయి, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడలతో బహుళ ప్రయోజనాలు



క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సత్కరిస్తున్న అధ్యాపకులు



లంకెలపాలెం హైస్కూల్‌లో ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

అగనంపూడి: క్రీడల వల్ల మానసిక, శారీరక దారుఢ్యంతో పాటు బహుళ ప్రయోజనాలు ఉంటాయని విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్ అన్నారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ క్రీడాంశాల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను సత్కరించారు. అధ్యాపకులు శివరామకృష్ణ, ప్రత్యూష, రాంబాబు, రమణ, ప్రశాంత్, భారతి పాల్గొన్నారు.

- లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు మాట్లాడుతూ భారత హాకీ జట్టుకు రెండున్నర దశాబ్దాల పాటు ప్రాతినిధ్యం వహించిన ధ్యాన్‌చంద్ ద్వారా క్రీడలకు గుర్తింపు వచ్చిందన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, రాణి పాల్గొన్నారు.

గిడుగు, ధ్యాన్‌చంద్ సేవలు చిరస్మరణీయం



గిడుగు, ధ్యాన్ చంద్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న హెచ్ఎం ప్రమీల తదితరులు




అలరించిన విద్యార్థుల నృత్యాలు

పెదగంట్యాడ: బహుభాషా శాస్త్రవేత్త, సంఘ సంస్కర్త, తెలుగు కవి గిడుగు వెంకట రామ్మూర్తి సేవలు చిరస్మరణీయమని ఇస్లాంపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల అన్నారు. అమృతం లాంటి తెలుగు భాషను మరువొద్దని ..భావితరాలకు అందించాలని సూచించారు. ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం గిడుగు వెంకట రామ్మూర్తి, జాతీయ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యానచంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు తల్లి, గిడుగు రామ్మూర్తి వేషధారణల్లోవిద్యార్థులు అలరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రాంధికంలో ఉన్న తెలుగులోని వచనాన్ని వాడుక భాషలోకి తీసుకువచ్చిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి అని కొనియాడారు. ఉపాధ్యాయులు ఆనందరావు, అప్పలనాయుడు, బ్రహ్మానందం, ఆశాలత, అన్నాజీరావు తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 64వ వార్డు యారాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గిడుగు వెంకట రామ్మూర్తి, మేజర్ ధ్యానచంద్ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఎస్వీ మోహన్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యకుమార్, సుజాత, విజయవల్లీ, కుసుమలత, నాగభూషణం పాల్గొన్నారు.

రేషన్ కార్డుల పంపిణీలో గందరగోళం



గాజువాక: రేషన్ కార్డుల పంపిణీ గాజువాక జోన్‌లో గందరగోళంగా మారింది. ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులు జారీ చేయాలని భావించిన ప్రభుత్వం వాటిని వార్డు సచివాలయాలకు అందజేసింది. అయితే అవి గుట్టలుగా రావడంతో కార్డులు వెతుక్కోవడానికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. నిరక్ష్యరాస్యులు తిప్పలు మరింత ఎక్కువగా ఉన్నాయి. పౌర సరఫరాల శాఖ సర్కిల్-3 పరిధిలో మొత్తం 1,30,905 స్మార్ట్ కార్డులు మంజూరయ్యాయి. వాటిని ఈ నెలాఖరులోగా లబ్ధిదారులకు సచివాలయాల్లో అందజేయాల్సి ఉంది. ఇక్కడ తీసుకోలేని కార్డుదారులకు వచ్చేనెల ఒకటి నుంచి పదో తేదీ వరకు రేషన్ డిపోల్లో అందజేయనున్నారు. అప్పటికీ తీసుకోలేని లబ్ధిదారులకు ఏఎస్‌వో సర్కిల్ కార్యాలయంలో అందజేస్తారు. వీలైనంతవరకు సచివాలయాల్లోనే కార్డులు తీసేసుకోవాలని అధికారులు కూడా ప్రకటించడంతో కార్డుదారులు సచివాలయాలకు పరుగులుపెడుతున్నారు. తమ రేషన్ డిపోకు సంబంధించిన కార్డులను చూసుకోవడం కోసం మరోపక్క రేషన్ డీలర్లు కూడా సచివాలయాలవద్దే నిరీక్షిస్తున్నారు. అయితే, పలు సచివాలయాల్లో దీనికోసం ఇద్దరు, ముగ్గురు సిబ్బందిని కేటాయించారు. వేల సంఖ్యలో ఉన్న కార్డులను చూసి వాటిని లబ్ధిదారులకు అందజేయడం వారికి తలకుమించిన పనిగా మారిపోయింది. మరికొన్ని సచివాలయాల్లో సిబ్బంది పంపిణీ చేయకుండా, కార్డులన్నీ ఒకచోట పడేసి లబ్ధిదారులను వెతుక్కోవాలని చెబుతున్నారు. సమస్య ఇక్కడే మొదలవుతోందని లబ్ధిదారులు వాపోతున్నారు. కార్డులపై అందరూ ఒకేసారి పడిపోతున్నారు. పేరు చూసి ఒకరి కార్డు ఒకరు తీసుకెళ్లిపోతున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఇంటికి వెళ్లి చూసుకున్న తర్వాత ఆ కార్డు తమది కాదని మళ్లీ సచివాలయాలకు వస్తున్నారు. ప్రతిరోజు ఇదే పరిస్థితి చోటుచేసుకొంటుండటంతో లబ్ధిదారులు తలలు పట్టుకొంటున్నారు.

ఒక్కటి కూడా..

ఇదిలా ఉండగా 65 ఏళ్లు దాటిన కార్డుదారులకు సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కార్డులు అందజేయాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు ఎక్కడా ఒక్క కార్డు కూడా వారు అందజేయలేదు. వారి కార్డులను కూడా అన్ని కార్డులతో కలిపేసి వెతుక్కోవాలని చెబుతున్నారని కార్డుదారులు వాపోతున్నారు. ఈనెల ఒకటోతేదీ నుంచి రేషన్ ఇవ్వనుండడంతో ఆలోగా తమ కార్డు తీసుకుందామని ఆశపడుతున్న వృద్ధులకు ఈ పరిస్థితి ఆవేదన కలిగిస్తోంది.

కొత్తకార్డులు నిల్

కాగా, కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసినా ఇంకా మంజూరు కాలేదు. కొత్త రేషన్‌కార్డులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించడంతో గత జూన్, జులై నెలల్లో అత్యధికమంది దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. దీనిపై ప్రభుత్వం ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంతో కొత్త కార్డులు మంజూరు కాలేదు.

తెలుగు భాష గొప్పతనం తెలుసుకో..



గిడుగుకు నివాళులర్పిస్తున్న మహాత్మాగాంధీ సేవా సంఘం ప్రతినిధులు



నడుపూరు పాఠశాలలో ధ్యాన్‌చంద్ పేరు ఆకారంలో విద్యార్థులు

అగనంపూడి: తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జయంతిని పలు పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తెలుగులో తియ్యదనం, తెలుగు భాష గొప్పదనాన్ని తెలియజేస్తూ విద్యార్థులు ప్రదర్శించిన పలు నాటికలు, స్కిట్స్ అలరించాయి.

- లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు భాషను ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అని అంటారని, తెలుగు విశిష్టతను ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాలన్నారు.
- ఏబీఎస్ పాఠశాలలో విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. వీటిలో పరమానందయ్య శిష్యుల హాస్యనాటిక ప్రదర్శన ఆకట్టుకుంది. పాఠశాల వ్యవస్థాపకుడు పీఎం కొండయ్య, ప్రిన్సిపాల్ యు.పద్మజ, డైరెక్టర్ దీపక్ పాల్గొన్నారు.
- అగనంపూడి కూడలిలో మహాత్మాగాంధీ సేవా సంఘం ఆధ్వర్యంలో గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాలలకు పలకలు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు చిత్తా రామారావు, విందుల చిరురాజు, ఫణి, ఆనంద్, తరుణ్, మనోజ్ పాల్గొన్నారు.
- తెలుగు భాషోద్యమానికి స్ఫూర్తి ప్రదాత గిడుగు రామ్మూర్తి అని నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం రాజ్‌కుమార్ అన్నారు. గిడుగు, ధ్యాన్ చంద్ జయంతి వేడుకలను పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. సిబ్బంది రాంబాబు, మంగమ్మ, అప్పలరాజు, పూసర్ల సరస్వతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఉక్కునగరంలో..

ఉక్కునగరం: తెలుగు భాషాదినోత్సవాన్ని ఉక్కునగరంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక కేబీఆర్ జంక్షన్‌లోని తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సత్యసాయి సంస్థల జిల్లా సమన్వయకర్త ఆర్‌ఏ నాయుడు, సమితి కన్వీనర్ జి. రామకృష్ణ, సర్వీస్ కోఆర్డినేటర్ విష్ణు, యూత్ సభ్యులు కృష్ణ, ప్రకాశ్, రవికుమార్, వరహాలు, నరసింగరావు, కాసా పద్మరాజు, సుబ్బరాజు పాల్గొన్నారు.



పరమానందయ్య శిష్యుల హాస్య నాటికను ప్రదర్శిస్తున్న ఏబీఎస్‌పాఠశాల విద్యార్థులు



లంకెలపాలెం పాఠశాలలో బుర్రకథను ప్రదర్శిస్తున్న బాలలు



భువన విజయం సభ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఘనంగా తెలుగుభాషా దినోత్సవం



చలపతి స్కూల్‌లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

గాజువాక: గిడుగు రామ్మూర్తి పంతులు 133వ జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని స్థానిక చలపతి స్కూల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు, వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డీన్ గణేష్, ప్రిన్సిపాల్ బి.రాజేష్ పాల్గొన్నారు.

- స్థానిక భాస్కర్ విద్యానికేతన్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులు గిడుగు రామ్మూర్తి పంతులు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు భాష ఉన్నతికి గిడుగు రామ్మూర్తి అందించిన సేవలను పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు వివరించారు.



భాస్కర్ విద్యానికేతన్‌లో..